

గురువారం ఉష్ణోగ్రతలు | గరిష్టం : 35.0°C | కనిష్టం : 19.5°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.33 గం..
సహర్ : శనివారం ఉ : 4.56 గం..



మానుకోట మార్కెట్‌కు తరలివస్తున్న మిర్చి

రికార్డుస్థాయిలో.. రాబడి

- లక్ష్యసాధనలో సఫలం.. జిల్లాలో మానుకోట, కేసముద్రం టాప్
- మూడు ఏఎంసీల ద్వారా ఇప్పటివరకు సమకూరింది రూ.16.05కోట్లు

ఏటికేడు పెరుగుతున్న వ్యవసాయ మార్కెట్ల ఆదాయం

మహబూబాబాద్ అగ్రికల్చర్, మార్చి 21 : జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లకు రాబడి ఏటికేడు పెరుగుతోంది. ప్రభుత్వానికి రికార్డుస్థాయిలో సమకూరుతుండగా.. మూడు ఏఎంసీల ద్వారా భారీగానే ఆదాయం సమకూరింది. ఈ క్రమంలో ప్రభుత్వ లక్ష్యాన్ని చేరుకుని మానుకోట, కేసముద్రం మార్కెట్లు టాప్‌లో ఉన్నాయి. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ ఆదాయం సుమారు రూ.7 కోట్లకు చేరుకుంటోంది. కేసముద్రం మార్కెట్‌కు రూ.6.50కోట్లు రాగా.. తొర్రూరు వ్యవసాయ మార్కెట్‌కు రూ.2.92 కోట్లకు చేరింది. మొత్తం ఆర్థికసంవత్సరం ముగిసేందుకు మరో పదిరోజులు గడువు ఉండగానే ఈ మూడే ఏఎంసీల ద్వారా రూ.16.05కోట్ల రాబడి వచ్చింది.

లక్ష్యాన్ని చేరుకున్న మానుకోట మార్కెట్

ఏనాడూ రానంతగా ఈ ఏడాది మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్ రాబడిని సాధించింది. ఈ మార్కెట్ 2023-24 ఆర్థిక సంవత్సర లక్ష్యం రూ.6.88 కోట్లు కాగా.. ఇప్పటికే రూ.6.88 కోట్లు సాధించింది. మరో 10రోజుల్లో ఆర్థిక సంవత్సరం ముగియనుండడంతో మరో రూ.20లక్షల వరకు ఆదాయం సమకూరే అవకాశం ఉంది. ప్రధానంగా ఈ మార్కెట్‌కు మిర్చి, పత్తి, ధాన్యం, మొక్కజొన్న అధికంగా రావడంతో ఆదాయం పెరుగుతోంది. గత ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు మిర్చి 1.27 లక్షల క్వింటాళ్లు, పత్తి 34 వేలు, ధాన్యం 1.54 వేలు, మొక్కజొన్నలు 85 వేల క్వింటాళ్లతో పాటు ఇతర అపరాల పంటలు ఉత్పత్తులు వచ్చాయి.

కేసముద్రం మార్కెట్‌కు రూ.6.25 కోట్లు..

కేసముద్రం వ్యవసాయ మార్కెట్ ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని మించి ఆదాయం సాధించింది. ప్రభుత్వం 2023-24 ఆర్థిక సంవత్సరానికి రూ.6.12 కోట్లు లక్ష్యం కాగా.. ఇప్పటి వరకు రూ.6.25కోట్లు వచ్చాయి. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే సమయానికి మరో రూ.25లక్షలు పెరిగే అవకాశం ఉంది. గతేడాది రూ.5.55కోట్లు సాధించగా ఈ సారి మరో రూ.కోటి వరకు పెరిగింది. ఇంకా సీసీఐ నుంచి రూ.78లక్షలు, సివిల్ సప్లయీస్ నుంచి రూ.1.16కోట్లు, మార్కెట్‌ఫెడ్ నుంచి మరో రూ.16లక్షలు రావాల్సి ఉంది. ఇప్పటి వరకు ప్రధానంగా మొక్కజొన్నలు 2.86 లక్షల క్వింటాళ్లు, ధాన్యం 5.22 లక్షల క్వింటాళ్లు, పత్తి 45 వేల క్వింటాళ్లు, మిర్చి 35 వేల క్వింటాళ్లు, పసుపు 11వేల క్వింటాళ్లు, ఇతర పంటలు వచ్చాయి. అయితే పసుపు, వేరుశనగ, కందులు, పెసల్లు పంటలు రైతులు పండించకపోవడంతో మార్కెట్‌కు రాబడులు తగ్గిపోయాయి.

మరిపెడ చెక్‌పోస్టు ద్వారా..

కేసముద్రం వ్యవసాయ మార్కెట్ పరిధిలో మరిపెడ పట్టణంలో మార్కెట్ చెక్‌పోస్టును ఏర్పాటు చేశారు. ఈ చెక్‌పోస్టు ఆదాయం ప్రతీ సంవత్సరం పెరుగుతోంది. 2020-21లో రూ.4.63 లక్షలు ఉండగా 2023-24 సంవత్సరంలో రూ.1.95 కోట్లుకు చేరుకుంది. ఖమ్మం -వరంగల్ ప్రధాన రహదారిపై చెక్‌పోస్టు ఉన్న కారణంగా మార్కెట్ రాబడి పెరుగుతోంది. చెక్‌పోస్టు ఆదాయంతో పాటు మార్కెట్ ఆదాయం పెంచడంలో మార్కెట్ అధికారులు, సిబ్బంది చేస్తున్న సేవలతో ఆదాయం పెరుగుతుందని చెప్పవచ్చు.

తొర్రూరు మార్కెట్‌లో..

తొర్రూరు మార్కెట్ విషయానికొస్తే చెక్‌పోస్టులపైనే గోదాం కిరాయిలు, ధాన్యం, సీసీఐ కొనుగోళ్లపైనే ఆదాయం సమకూరుతోంది. తొర్రూరు మార్కెట్‌లో 2023-24లో రూ.3.96కోట్లు లక్ష్యం విధించినప్పటికి ఇప్పటి వరకు రూ.2.92 కోట్లు సమకూరాయి. సీసీఐ నుంచి రూ.64 లక్షలు, మార్చి 31 వరకు వచ్చే అవకాశం ఉంది. వడ్ల కొనుగోళ్లపై రూ.2 కోట్లు ఈ మార్కెట్‌కు ఆదాయం రావాల్సి ఉంది. కాగా, ఈ మార్కెట్‌లో కవర్‌షెడ్లు, గోదాంలు, నెల్లికుదురులో సబ్‌యార్డు ఉన్నప్పటికి సరుకులకు రాకపోవడంతో క్రయవిక్రయాలు జరుగడం లేదు. వివిధ గ్రామాల నుంచి సరుకులు రప్పించి, వ్యాపారులతో కొనుగోళ్లు చేపట్టేందుకు తొర్రూరు మార్కెట్ అధికారులు కానీ, ఉన్నతాధికారులుకానీ ప్రయత్నించకపోవడం శోచనీయం. వ్యాపారులతో మార్కెట్ నడిపిస్తే కేసముద్రం, మహబూబాబాద్ మార్కెట్ల సరసన నిలబడే అవకాశం ఉంది. కొత్త గా ఎన్నికైన పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఈ ఏడాదిలో ప్రయత్నాలు కొనసాగించాలని రైతులు కోరుతున్నారు.

లక్ష్యాన్ని అధిగమించాం

- కె.అమరలింగేశ్వరరావు, ప్రత్యేక హోదా, కార్యదర్శి, కేసముద్రం



కేసముద్రం మార్కెట్‌లో ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం విధించిన లక్ష్యాన్ని పూర్తి చేసి అధిగమించాం. ఈ ఏడాది రూ.6.25 కోట్లు కాగా, మరో పదిరోజుల్లో రూ.25 లక్షలు వచ్చే అవకాశం ఉంది. ఇంకా సీసీఐ, సివిల్‌సప్లై, మార్క్‌ఫెడ్ నుంచి బకాయిలు రావాల్సి ఉంది. మరిపెడ చెక్‌పోస్టు ఆదాయం కూడా బాగా పెరిగింది. కొత్త ఆర్థిక సంవత్సరంలో మార్కెట్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు మార్కెట్ ఉన్నతాధికారులు, సిబ్బంది రైతులు, కార్మికులతో కృషి చేస్తాం.

రూ.ఏడుకోట్లకు చేరుకుంటున్న రాబడి..

శంషీర్, మార్కెట్ కార్యదర్శి, మహబూబాబాద్



ప్రభుత్వం విధించిన టార్గెట్‌కు మించి అత్యధికంగా ఆదాయం సాధించాం. మార్కెట్‌లో సిబ్బంది తక్కువగా ఉన్నప్పటికి ఉన్న సిబ్బందితోనే మార్కెట్ కార్యకలాపాలను నడిపించి ఉన్నతాధికారులు, వ్యాపారుల సహకారంతో లక్ష్యాన్ని పూర్తి చేశాం. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ అభివృద్ధికి, ఆదాయం పెంచేందుకు తోడ్పాటు అందిస్తాం.

ఆదివాసీ దేవతలను దర్శించుకున్న మంత్రి సీతక్క



గుంజేడులో శ్రీముసలమ్మ దేవతను దర్శించుకుంటున్న సీతక్క

కొత్తగూడ, మార్చి21 : మండలంలోని గుంజేడు, ఎంచగూడెంలో ఆదివాసీ దేవతలైన శ్రీముసలమ్మ, కొమ్మాలమ్మలను పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖమంత్రి దనసరి అనసూయ సీతక్క గురువారం రాత్రి దర్శించుకున్నారు. గుంజేడులో దేవాదాయశాఖ ఈవో భిక్షమాచారి, పూజారులు, కొమ్మాలమ్మ జాతరలో వాసం వంశీయులు ఆమె స్వాగతం పలికారు. సీతక్కచే ప్రత్యేక పూజలు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆదివాసీ జాతరల అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. జాతరలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని సూచించారు.

కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ చల్లా నారాయణ రెడ్డి, డీసీసీ జనరల్ సెక్రటరీ బానోత్ రూప్‌సింగ్, జడ్పీటీసీ పుల్సంపుష్పలత శ్రీనివాస్, ఎంపీపీ బానోత్ విజయ, వైస్ ఎంపీపీ జంపయ్య, సర్పంచ్ మల్లెల రణధీర్, ఎంపీటీసీ భూర్క పుష్పలత నరేందర్, గుంజేడులో ఈవో భిక్షమాచారి, పూజారులు తోలెం చిన్ననర్సయ్య, తోలెం వెంకటేశ్వర్లు, తోలెం వెంకన్న, కిరణ్‌కుమార్, రాంబాబుల, నవీన్‌కుమార్, అనంతరావు, కొమ్మాలమ్మ జాతరలో దల్వాయి వాసం సమ్మయ్య, తలపతి వాసం వీరాస్వామి, జలకపు వడ్డె యాలం లక్ష్మయ్య, ఉద్యోగులు వాసం కుమారస్వామి, ఆలూరి సమ్మయ్య, వాసం పాపయ్య, సందీప్, ఆలూరి సారంగపాణి, వాసం ప్రభాకర్, ఆలూరి క్రిష్ణయ్య, భక్తులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సుంకరి వీరయ్య

తెలంగాణలో ఒక ఎంపీ సీటు కేటాయించాలి

- రాష్ట్రంలో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటుకు సిద్ధం
- మేడిగడ్డపై విచారణ కమిటీ వేయాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుంకరి వీరయ్య

వివరాలు 8లో..

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

- కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్





మానుకోటలో కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్, ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ ఆధ్వర్యంలో కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు, పోలీసులు

మహబూబాబాద్, మార్చి21 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధమని, ప్రతీక్కరు ఓటుహక్కును వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్ సింగ్ పిలుపునిచ్చారు. మానుకోట పట్టణంలోని తహసీల్దార్ సెంటర్ నుంచి అండర్‌బ్రిడ్జి, ఫారెస్టు సెంటర్, బస్టాండ్, మీదుగా అయ్యప్ప టెంపుల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు కేంద్ర బలగాలతో గురువారం పోలీస్ అధికారులు కవాతు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడుతూ ప్రజలు ఎవరికి భయపడాల్సిన అవసరంలేదని, ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకోవాలని సూచించారు. పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు చేస్తున్నామని, పోలింగ్‌కేంద్రాల్లో అన్నివసతులు కల్పిస్తున్నామని చెప్పారు. ఓటుహక్కును సద్వినియోగం చేసు కుని జిల్లాలో పోలింగ్ శాతం పెంచాలన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై దృష్టి : ఎస్పీ

పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టిసారించామని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రశాంతవాతావరణంలో ఎలక్షన్లు జరిగేందుకు ప్రజలు సహకరించాలన్నారు. రాబోయే ఎన్నికలకు సంబంధించి జిల్లాకు కేంద్రబలగాలు వచ్చాయని, త్వరలోనే మరిన్నిబలగాలు వస్తాయని చెప్పారు. రాబోయే ఎన్నికల సందర్భంగా ఇప్పట్నుంచే సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. జిల్లాలో 1,783 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. ఇందులో కొన్నింటిని సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించడం జరిగిందన్నారు. ఎవరైనా చట్టవిరుద్ధంగా ప్రవర్తించిన, గొడవలు సృష్టించాలని చూసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు హెచ్చరించారు. ప్రజలు వర్గవిభేధాలు లేకుండా శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలన్నారు. సివిజిల్ యాప్ ద్వారా ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చని చెప్పారు. ఎవరైనా రూ.50 వేలకంటే ఎక్కువ మొత్తంలో నగదు తీసుకువెళ్తే అందుకు సంబంధించిన పత్రాలను చూపించాలన్నారు.

బంగారు అభరణాలు పెద్దమొత్తంలో తీసుకువెళ్తే వాటికి బిల్లులు చూపించాలని చెప్పారు. ఎలాంటి పత్రాలు చూపించని నగదు, బంగారు ఆభరణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ జోగుల చెన్నయ్య, ట్రైనీ ఐపీఎస్ పండరీ చేతన్, డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు, కేంద్ర బలగాల సిబ్బంది పాల్గొన్నారు.

డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో..

డోర్నకల్ : రానున్న ఎన్నికల దృష్ట్యా ప్రజలలో నిర్భయంగా ఓటువేయడానికి పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజల్లో భరోసా కల్పించేందుకు ఈ కవాతు నిర్వహిస్తున్నట్లు మహబూబాబాద్ డీఎస్పీ తిరుపతిరావు అన్నారు. డోర్నకల్ మునిసిపల్ కేంద్రంలో కేంద్ర, పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈ కవాతు జగ్జీవన్‌రాం విగ్రహం వద్ద నుంచి ప్రారంభమై ఎన్టీఆర్ విగ్రహం వరకు కొనసాగింది. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి ఓటింగ్‌లో పాల్గొనాలన్నారు. ఈ ర్యాలీ లో తొర్రూరు ఆర్డీవో నర్సింహారావు, మహబూబాబాద్ జిల్లా అడిషనల్ ఎస్పీ చెన్న య్య, డీఎస్పీ మోహన్, తహసీల్దార్ కృష్ణవేణి, సీఐలు ఉపేందర్‌రావు, రవి కుమార్, ఎస్సైలు సంతోష్‌రావు, తిరుపతి, జీనత్, కేంద్ర బలగాలు పాల్గొన్నారు.

సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన 'నూకల'

- పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

మహబూబాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : జిల్లాకు చెందిన బీఆర్ఎస్ రాష్ట్రప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి గురువారం సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. డోర్నకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు అత్యంత కీలకమైన నరేష్‌రెడ్డితోపాటు మాజీ ఓడీసీఎంఎస్ ఛైర్మన్ నూకల వేణుగోపాల్ రెడ్డి, చిన్నగూడూరు జడ్పీటీసీ భర్త మురళీధర్‌రెడ్డి, బాలు చౌహాన్, జేఏసీ నాయకులు మెంచు అశోక్, మాజీ సర్పంచ్‌లు నూకల అభినవ్ రెడ్డి, బానోత్ రాంలాల్ కాంగ్రెస్‌లో చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రునాయక్ పాల్గొన్నారు.



సీఎం రేవంత్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న నూకల నరేష్‌రెడ్డి



మహిమాన్వితుడు శ్రీ వేంకటేశ్వరుడు

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- 25న స్వామివారి కల్యాణోత్సం
- భారీగా తరలిరానున్న భక్తులు

ఇంద్రకీలాద్రి పర్వతంపై వేంకటేశ్వరస్వామి దేవాలయం, (ఇన్‌సెట్లో) స్వామివారి ప్రతిమ

నర్సింహులపేట, మార్చి 21 : మహిమాన్వితుడు వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల 23వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. నర్సింహులపేట మండలకేంద్రం సమీపంలోని ఇంద్రకీలాద్రి పర్వతంపై కొలువు దీరిన పద్మావతి, అలివేలు మంగమ్మ సహిత వేంకటేశ్వరస్వామి ఆలయం పరిసరాలు భక్తిభావంతో మార్మోగనున్నాయి. మినీ తిరుపతిగా ప్రఖ్యాతి పొందిన శ్రీనివాసుడు భక్తులు కోరిన కోర్కెలు కొంగు బంగారమవుతుండడంతో రోజురోజుకూ తాకిడి అధికమవుతున్నది. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయం సిబ్బంది, పాలకమండలి అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 25న జరిగే స్వామి వారి కల్యాణోత్సవానికి నర్సింహులపేట మండలం నుంచే కాకుండా తొర్రూరు, నెల్లికుదురు, మహబూబాబాద్, కురవి, మరిపెడ, డోర్నకల్ మండల ప్రజలతో పాటు ఖమ్మం, నల్గొండ జిల్లాల నుంచి భక్తులు తరలివస్తారు. ఐదు రోజులపాటు జరిగే ఈ ఉత్సవాలను పురస్కరించుకొని ఖమ్మం-వరంగల్ ప్రధాన రహదారిపై ఉన్న స్వాగత తోరణంతో పాటు ఆలయం గర్భగుడి, కల్యాణ మండపాన్ని విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు.

కార్యక్రమాలు ఇలా..

ఈ నెల 23వ తేదీన పాల్గుణ త్రయోదశి రాత్రి 8 గంటలకు తొళక్కంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 24న బిందెతీర్థం ప్రాబోధిత ప్రబంధసేవాకాలం, పరమపథోత్సవం, తీర్థప్రసాదం గోష్టి జరుగుతుంది. 25న విశ్వక్సేనారాధన పుణ్యాహచనం, అంకురార్పణం, బేరీపూజ, దేవతారోహనం, హోమం బలిహరణం తర్వాత రాత్రి 8గంటలకు స్వామివారి కల్యాణం జరుగనుంది. 26న హోమం బలిహరణం, పురవీధిసేవ, సదస్యం, తీర్థప్రసాద గోష్టి. 27న పూర్ణహుతి ధ్వజపట ఉద్వాసన, పుష్పయాగం, ఏకాంతసేవ, మహదాశీర్వచనంతో ఉత్సవాలు ముగియనున్నాయి.

'అడవుల రక్షణ ప్రతీ ఒక్కరి బాధ్యత'

- ఎఫ్‌డీవో కృష్ణమాచార్యులు

నెహ్రూసెంటర్, మార్చి21 : మానవ మనుగడకు ఉపయోగపడుతున్న అడవులను రక్షించు కోవాల్సిన బాధ్యత ప్రతీఒక్కరిపై ఉందని ఫారెస్టు డివిజన్ అధికారి (ఎఫ్‌డీవో) కృష్ణమాచార్యులు అన్నారు. 'మార్చి 21న ప్రపంచ అటవీ దినోత్సవాన్ని' పురస్కరించుకుని మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో గురువారం మదర్ థెరిస్సా సెంటర్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ నుంచి జమాండ్లపల్లిలోని జిల్లా ఫారెస్టు కార్యాలయం వరకు ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవమనుగడ కోసం అడవులు దోహదపడుతున్నాయన్నారు. అడవులు పచ్చదనంతో కళకళలాడితే వాతావరణంలో మార్పులు చోటు చేసుకుని సకాలంలో వర్షాలు కురుస్తాయని చెప్పారు. మహబూబాబాద్ రేంజ్ ఆఫీసర్‌జోత్స్నాదేవి, జూనియర్ ఫారెస్టు అధికారుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బానోత్ సాంబునాయక్, రీనా, సరోజ, బాలాజీ, నవీన్, హరిసింగ్, వీరన్న, లక్ష్మణ్, బాలు, స్వామి, నర్మద, ప్రత్యూష, శ్రీధర్ పాల్గొన్నారు.



మానుకోటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఫారెస్టు అధికారులు, సిబ్బంది

ఓటు వేసే విధంగా ఓటర్లను చైతన్యపరచాలి

హనుమకొండ కలెక్టరేట్, మార్చి21: ఓటు హక్కు కలిగిన ప్రతీ ఓటరును ఎన్నికల్లో ఓటు వేసే విధంగా చైతన్యపరచాలని ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో స్వీప్ ఆధ్వర్యంలో గురువారం వివిధ శాఖల అధికారులు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, అపార్ట్‌మెంట్ల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులతో ఓటరు చైతన్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ట్రెయినీ కలెక్టర్ శ్రద్ధా శుక్లా మాట్లాడుతూ.. స్వీప్ ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి, స్వీప్ నోడల్ అధికారి లక్ష్మీ రమాకాంత్, డీఆర్‌వో వైవీ గణేష్, జీడబ్ల్యూఎంసీ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, డీఎంహెచ్‌వో డాక్టర్ సాంబశివరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎస్సీ గురుకులాల్లో దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 21: వరంగల్ రీజియన్‌లోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లోని 6, 7, 8, 9 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ సీట్ల కోసం ఈనెల 23 వరకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా రీజినల్ కోఆర్డినేటర్ ఎస్.విద్యారాణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 2024-25 విద్యా సంవత్సరానికిగాను కాలేజ్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో 8, 9 తరగతుల్లో ప్రవేశాల కోసం ఈ నెల 23లోగా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 21వ తేదీన ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉంటుందని ఆమె తెలిపారు. www.tswreis.ac.in వెబ్ పోర్టల్‌లో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆమె కోరారు.



ఉప రాష్ట్రపతిని కలిసిన వద్దిరాజు రవిచంద్ర

ఉపరాష్ట్రపతిని కలిసిన ఎంపీ రవిచంద్ర

వరంగల్ సిటీ, మార్చి 21: బీఆర్ఎస్ పార్టీ నుంచి ఏకగ్రీవంగా ఎన్నికైన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర గురువారం ఢిల్లీలో ఉప రాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధనకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. తెలంగాణ శాసన సభ్యులు మీసేవలను గుర్తించి, మీ పట్ల విశ్వాసం ఉంచి తిరిగి రాజ్యసభకు పంపించారని ఈ సందర్భంగా జగదీప్ ధన్‌కర్ రవిచంద్రను అభినందించారు. అదేవిధంగా ఈ ప్రజాస్వామ్య(పార్లమెంట్) దేవాలయంలో అర్థవంతమైన, ఆరోగ్యకరమైన చర్చలు జరిపేందుకు మీ అనుభవం ఎంతో ఉపయోగపడుతుందని రవిచంద్రతో అన్నారు. స్పందించిన రవిచంద్ర ధనకర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఆత్మహత్య



ప్రశాంత్(ఫైల్)

ఐనవోలు, మార్చి 21: ఆర్థిక ఇబ్బందులతో కౌలు రైతు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఐనవోలులో చోటుచేసుకుంది. ఎస్సై అనిల్‌కుమార్ కథనం ప్రకారం.. మండలకేంద్రానికి చెందిన బరిగెల ప్రశాంత్(24) మూడేళ్ల నుంచి కొంత మంది రైతుల వద్ద నాలుగు ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని పంటలు సాగుచేయగా దిగుబడి రాక ఆర్థికంగా నష్టపోయాడు. పెట్టుబడులకు చేసిన రూ.4లక్షల అప్పులు తీర్చే మార్గం కనిపించక మనస్థాపానికి గురై బుధవారం రాత్రి ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకున్నాడు. కుటుంబసభ్యులు గుర్తించి వేలాడుతున్న ఉరి నుంచి అతడిని తప్పించి ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు నిర్ధారించారు. కౌలు రైతుగా చేసిన అప్పులు తీర్చే దారి కనిపించక భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడని భార్య అనుషా ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య ఒక కుమారుడు ఉన్నారు.

మందులోళ్లు.. మాయలోళ్లు..

● అక్రమంగా ప్రభుత్వ మందుల విక్రయాలు ● కంటి ఆస్పత్రిలో ఏళ్ల తరబడి కొనసాగుతున్న దందా



వరంగల్ మెడికల్, మార్చి 21: ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో మాయలోళ్లు తయారయ్యారు. మందులు పంపిణీ చేసే ఉద్యోగులు అక్రమ విక్రయాలకు పాల్పడుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేసే ఔషధాలను పేద రోగులకు ఇవ్వకుండా వారి ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. ఇదంతా ఏళ్ల తరబడి జరుగుతున్నప్పటికీ పర్యవేక్షించాల్సిన ఆస్పత్రి సూపరింటెండెంట్ పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. ఏకంగా అక్రమ మందుల విక్రయాలను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకునేంతవరకు కూడా ఆస్పత్రి అధికారులు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఆరోపణలు వచ్చినా అంతే..

ప్రాంతీయ నేత్ర వైద్యశాలలో కొన్నేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఫార్మసిస్టు నాగేందర్‌పై అనేక ఆరోపణలు వచ్చినప్పటికీ ఆయనపై చర్యలు తీసుకోవడం లేదు. గతంలో స్టోర్స్‌లో పనిచేసిన ఈయన.. మళ్లీ అదే ఆస్పత్రిలో ఓపీ బాధ్యతలు అప్పగించినట్లు తెలిసింది. కొన్నేళ్లుగా ఇదే ఆస్పత్రిలో తిష్ట వేయడంతోపాటు అన్ని విషయాలు అవపోసనపట్టి అక్రమంగా మందులను విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఎంజీఎంతోపాటు బోధనాస్పత్రుల్లో కూడా ఈ దందా కొనసాగుతున్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. మురికివాడల్లోని అర్బన్ సెంటర్లలో కూడా మందులు పక్కదారి పడుతున్నట్లు అధికారులు గుర్తించినట్లు సమాచారం.

మార్కెట్‌లో శాంపిల్స్

వివిధ కంపెనీలు డాక్టర్లకు ఇచ్చే శాంపిల్ ఔషధాలు కూడా మార్కెట్‌లో దర్శనమిస్తున్నాయి. ఇవి డాక్టర్ ద్వారా రోగులకు ఉచితంగా పంపిణీ చేయాల్సి ఉన్నప్పటికీ నిబంధనలకు విరుద్ధంగా కొన్ని మెడికల్ షాపులు విక్రయాలకు తెగబడుతున్నట్లు తెలుస్తోంది. అదే విధంగా కొందరు లేబుళ్లను మార్చి నకిలీ మందులను కూడా తయారు చేస్తున్నట్లు కొంతకాలంగా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. నార్కోటిక్ డ్రగ్స్ డాక్టర్ చిట్టీ లేకుండానే అమ్ముతున్నట్లు ఔషధ నియంత్రణ శాఖ తనిఖీల్లో అనేక పర్యాయాలు బయటపడింది. కఠిన చర్యలు తీసుకోకపోవడంతో ఈ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. కాజీపేట సమీపంలోని నిట్‌క్యాంపస్ ఏరియాలో నార్కోటిక్ డ్రగ్స్ విక్రయాలు కొనసాగుతున్నట్లు విశ్వసనీయంగా తెలుస్తోంది.

అన్నీ ప్రైవేట్ అద్దాల షాపులే..

ప్రభుత్వ ప్రాంతీయ నేత్ర వైద్యశాల గల్లీలో నిబంధనలకు విరుద్ధంగా అన్నీ ప్రైవేట్ అద్దాల షాపులే వెలిశాయి. మెడికల్ షాపుల్లో సైతం అద్దాలు విక్రయించడం కనిపిస్తుంటుంది. కంటి ఆస్పత్రి నాలుగో తరగతి ఉద్యోగులు ప్రయివేట్ అద్దాల షాపులతో కుమ్మక్కై రోగులను బయటకు పంపిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రామీణ ప్రాంత ప్రజల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా కంటి అద్దాలను విక్రయాలకు పాల్పడుతూ సొమ్ము చేసుకుంటున్నారు. బహిరంగంగా ఈ దందా జరుగుతున్నా సంబంధిత అధికారులు అటువైపు చూడకపోవడం గమనార్హం.

'బార్' బరిలో వీరే..

హనుమకొండ బార్ ఎన్నికల్లో పోటాపోటీ

వరంగల్ లీగల్, మార్చి 21: హనుమకొండ జిల్లా బార్ అసోసియేషన్‌కు ఈనెల 28న జరుగనున్న ఎన్నికల బరిలో 32 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అధ్యక్షస్థానానికి ఎం.రమేష్‌బాబు, పి.సత్యనారాయణ పోటీ పడుతుండగా ఉపాధ్యక్ష పదవికి పి.రఘుపతి, ఎస్.రాజన్‌బాబు, పి.రవీందర్, ఎస్.యుగంధర్ బరిలో ఉన్నారు. అలాగే ప్రధానకార్యదర్శి పదవికి వి.నరేందర్, పి.నవీన్‌కుమార్, ఎల్.రమేష్, బి.శంకర్, ఆర్.వేణుగోపాల్ పోటీ పడుతున్నారు. మహిళా జాయింట్ సెక్రటరీ పదవికి వి.పద్మ, జె.స్వప్న, స్పోర్ట్స్ కల్చరల్ జాయింట్ సెక్రటరీ పదవికి పి.చిరంజీవి, ఎం.మహేష్ పటేల్, సి.మల్లేష్, కోశాధికారి పదవికి జి.సదానందం, పి.నమ్మిరెడ్డి, ఎ.శివశంకర్‌లు పోటీ పడుతున్నారు. కార్యవర్గ సభ్యులుగా డి.అచ్యుత్‌కుమార్, జి.అనిల్ లాలానాయక్, ఇ.చంద్రశేఖర్, సీహెచ్.నిఖిల్‌కుమార్, వి.రమేష్, కె.రుత్విక్, ఎ.సందీప్‌కుమార్, ఎన్.సుహాస్, డి.సునిల్‌కుమార్, మహిళా కార్యవర్గ సభ్యుల పదవికి జి.రమాదేవి, కె.ఉష పోటీ పడుతున్నారు. జాయింట్ సెక్రటరీ పదవికి ఎన్.విజేందర్, లైబ్రరీ జాయింట్ సెక్రటరీ పదవికి బి.సంపత్, 30 ఏళ్ల న్యాయవాదిగా సర్వీస్‌లో ఉన్న కార్యవర్గ సభ్యుడిగా జి.సురేందర్‌రెడ్డి, 20 ఏళ్ల న్యాయవాదిగా సర్వీస్‌లో ఉన్న కార్యవర్గ సభ్యుడిగా టి.శ్రీనివాస్, 10 ఏళ్ల మహిళా న్యాయవాదిగా సర్వీస్‌లో ఉన్న కార్యవర్గసభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎలక్షన్ నిర్వాహకులు ప్రకటనలో తెలిపారు.

చోరీలకు పాల్పడిన నిందితుడి అరెస్టు

కాజీపేట, మ్యా 21 : చిరువ్యాపారుల గల్లా పెట్టెల్లోంచి నగదు చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మూడు రోజుల క్రితం కాజీపేటలో నాగరాజు ఫ్రూట్ షాపులో ఓ వ్యక్తి ఫ్రూట్స్ కొనుగోలు చేసి అతడి దృష్టి మరల్చి గల్లా పెట్టెల్లోంచి రూ.1250 చోరీ చేశాడు, నాగరాజు ఫిర్యాదు మేరకు సీసీ కెమెరాల ఆధారంగా కేసు దర్యాప్తు చేస్తున్న క్రమంలో గురువారం కడిపికొండ బ్రిడ్జి వద్ద పోలీసులను చూసి ఓ వ్యక్తి పారిపోతుండగా అతడిని పట్టుకుని ఆరా తీయగా అతడి పేరు యాకుబ్ పాష అని వరంగల్ చింతల్ ప్రాంతానికి చెందిన ఇతను కాజీపేట ఫ్రూట్ షాపులో నగదును, పలు షాపులలో చోరీలకు పాల్పడుతున్నానని ఒప్పుకున్నాడు. నేరం ఒప్పుకోవడంతో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వై. సుధాకర్ రెడ్డి తెలిపారు. కేసును చేధించిన ఎస్సై శివకృష్ణ, కానిస్టేబుల్స్ భాస్కర్, విష్ణులను ఏసీపీ తిరుమల్ రావు అభినందించారు.

సమర్థవంతంగా పనిచేస్తున్న సంఘాలు

నాబార్డు డీజీఎం తప్పని కుమార్ సాహూ



మాట్లాడుతున్న కుమార్ సాహూ

కాళోజీ జంక్షన్, మార్చి 21: ఉమ్మడి వరంగల్ జిల్లాలో 64 రైతు ఉత్పత్తి దారుల సంఘాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయని, సంఘాలు ఏర్పడిన మొదట్లో ఎన్నో ఒడిదొడుకులను ఎదుర్కొన్నప్పటికీ ప్రస్తుతం చాలా సంఘాలు విజయవంతంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నాయని నాబార్డు డీజీఎం తప్పని కుమార్ సాహూ అన్నారు. నాబార్డు వరంగల్ క్లస్టర్ ఆధ్వర్యంలో హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో గురువారం నిర్వహించిన రైతు ఉత్పత్తిదారుల సంఘాల సమీక్ష సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సంఘాల అభివృద్ధికి అవసరమైన శిక్షణ, కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని అన్నారు. కందులను డైరెక్టుగా కాకుండా పప్పుగా మార్చడం ద్వారా రైతుకు రెట్టింపు ఆదాయం సమకూరుతుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో వరంగల్ డీడీఎం చంద్రశేఖర్, డీఆర్‌డీప ప్రాజెక్టు మేనేజర్ సంతోష్, కార్తీక్, హర్షవర్ధన్, సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు రెడ్‌క్రాస్ చైర్మన్ శుభాకాంక్షలు



గవర్నర్‌కు బొకే అందజేస్తున్న హనుమకొండ రెడ్ క్రాస్ చైర్మన్ డాక్టర్ విజయ్‌చందర్‌రెడ్డి, సభ్యులు

కాళోజీ జంక్షన్, మార్చి 21: రాష్ట్ర నూతన గవర్నర్, రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సీపీ రాధాకృష్ణన్‌ను హనుమకొండ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, రాష్ట్ర పాలక వర్గ సభ్యులు ఈవీ శ్రీనివాసరావు రాజ్‌భవన్‌లో మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రెడ్ క్రాస్ కార్యక్రమాలపై జిల్లా చైర్మన్లు రాష్ట్ర పాలక వర్గ సభ్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో గవర్నర్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ ఇప్పటి వరకు రెడ్ క్రాస్ సంస్థలు ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నాయని ఇక ముందు కూడా జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించాలని ఆకాంక్షించారు. వేసవి కాలం దృష్ట్యా బ్లడ్ సెంటర్లలో రక్తం కొరత లేకుండా చూడాలని ఆయన సూచించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే శిక్ష తప్పదు

రౌడీషీటర్లకు హనుమకొండ సీఐ సతీష్ హెచ్చరిక



రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ సతీష్

హనుమకొండ టౌన్, మార్చి21 : రానున్న లోక్‌సభ ఎన్నికల్లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినట్లయితే కఠినమైన శిక్షలు తప్పవని హనుమకొండ సీఐ వై.సతీష్ రౌడీషీటర్లను హెచ్చరించారు. గురువారం పోలీస్‌స్టేషన్ ఆవరణంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రస్తుతం ఎక్కడుంటున్నారు..? ఎవరెవరు ఏమి చేస్తున్నారు? అనే దానిపై అడిగి తెలుసుకున్నారు. ఆరు నెలల వ్యవధిలో బైండోవర్ కాని వారిని తప్పనిసరిగా ఈసారి బైండోవర్ చేస్తామని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఎవరెవరిపై కేసులు నమోదయ్యాయని ఆరా తీశారు. అసాంఘిక చర్యలకు పాల్పడ్డట్లు ఫిర్యాదు అందితే ఎట్టి పరిస్థితుల్లో విడిచిపెట్టేదిలేదని హెచ్చరించారు. కౌన్సెలింగ్ హాజరుకాని వారికి త్వరలోనే నిర్వహిస్తామన్నారు. కౌన్సెలింగ్‌లో సీఐతోపాటు ఎస్సైలు శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

పోలీసు అధికారిపై పోక్సో కేసు?

రహస్యంగా పోలీసుల విచారణ

వరంగల్ క్రైం, మార్చి21: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో గతంలో ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం సీఐగా పొరుగు జిల్లాలో పనిచేస్తున్న పోలీసు అధికారిపై పోక్సో చట్టం కింద కేసు నమోదైనట్లు అధికారిక సమాచారం. 2022 సంవత్సరంలో కేయూలో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న సమయంలో సదరు అధికారికి స్టేషన్ పరిధిలో ఒక మహిళతో సన్నిహిత సంబంధాలున్నట్లు సమాచారం. ఈ విషయంలో మహిళ భర్త పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు చేయగా, ఏఆర్‌కు అటాచ్ చేసినట్లు తెలిసింది. అనంతరం సీఐగా పదోన్నతి పొంది ఖమ్మం జిల్లాకు, అటునుంచి భూపాలపల్లి జిల్లాకు బదిలీపై వెళ్లిన సదరు అధికారి.. ఇంకా మహిళతోనే సన్నిహిత సంబంధాలు కొనసాగిస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో సదరు మహిళ కూతురిపై కన్నేసిన పోలీసు అధికారి.. అత్యాచార యత్నం చేసినట్లు తెలిసింది. మైనరైన తన కూతురుపై పోలీసు అధికారి అత్యాచారయత్నానికి పాల్పడినట్లు ఇటీవల కేయూలో మహిళ ఫిర్యాదు చేసినట్లు సమాచారం. విచారణ చేసిన కేయూ పోలీసులు.. గురువారం సదరు అధికారిపై అత్యాచార యత్నం, పోక్సో కేసు నమోదు చేసినట్లు తెలిసింది. ఈ విషయమై కేయూ పోలీసులను వివరణ కోరేందుకు ప్రయత్నించగా చెప్పేందుకు నిరాకరించారు. పోలీస్ అధికారి కావడంతో వివరాలు వెల్లడించలేదు. రహస్యంగా విచారణ చేస్తున్నట్లు తెలిసింది.

లారీ డ్రైవర్‌పై కానిస్టేబుళ్ల దౌర్జన్యం

- కేసముద్రంలో వారం కిందట ఘటన
- ఎస్పీ ఆధ్వర్యంలో విచారణ

కేసముద్రం, మార్చి 21 : కేసముద్రం స్టేషన్‌లో ఓ లారీ డ్రైవర్‌పై ఇద్దరు కానిస్టేబుళ్లు దౌర్జన్యంగా వ్యవహరిస్తూ బట్టలు విప్పి డ్రాయర్‌పై లాగుతున్న ఫొటో గురువారం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఇసుకను రవాణా చేసిన ఒక లారీ డ్రైవర్‌పై కేసముద్రం పోలీస్‌స్టేషన్ పరిధిలో రాత్రి పెట్రోలింగ్ చేస్తున్న ఇద్దరు కానిస్టేబుళ్లు అసభ్యంగా వ్యవహరించినట్లు తెలిసింది. ఈ విషయంపై ఎస్ఐ వంశీధర్‌ను వివరణ కోరగా, ఈ ఘటనపై జిల్లా ఎస్పీకి సమాచారం ఇచ్చామని, దీనిపై విచారణ కొనసాగుతోందని తెలిపారు. ఇదిలా ఉండగా విచారణ అనంతరం సదరు కానిస్టేబుళ్లను నేడోరేపో సస్పెండ్ చేసే అవకాశం ఉన్నట్లు ఎస్పీ కార్యాలయం నుంచి సమాచారం అందింది.

మానుకోటలో 'రజాకార్' సందడి

లక్ష్మీ థియేటర్‌లో ప్రేక్షకులతో కలిసి సినిమాను వీక్షించిన చిత్ర యూనిట్



మహబూబాబాద్ లక్ష్మీ థియేటర్‌లో మాట్లాడుతున్న సినీ నటి అనసూయ

మహబూబాబాద్ టౌన్, మార్చి 21 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో 'రజాకార్' చిత్రం యూనిట్ సభ్యులు గురువారం సందడి చేశారు. సినిమా విజయవంతంగా ప్రదర్శిస్తున్న నేపథ్యం లో అందులోని నటీనటులు అనసూయ, రాజ్‌అర్జున్, గిరి, శివం, సత్యనారాయణ, రమణ, అంజిరెడ్డి, పూజ, సినీ దర్శకుడు యాట సత్యనారాయణ, సంగీత దర్శకుడు, మానుకోట ప్రాంతవాసి బీమ్స్ సిసిరోలియో మానుకోటలో పర్యటించారు. రజాకార్ చిత్రం ప్రదర్శింపబడుతున్న లక్ష్మీ థియేటర్‌కు యూనిట్ సభ్యులు చేరుకోవడంతో ప్రేక్షకులు పెద్దఎత్తున తరలివచ్చి, ఘనస్వాగతం పలికారు. బాణ సంచాలు కాల్చుతూ, పూలుచల్లుకుంటూ ఆహ్వానించారు. యూనిట్ సభ్యులు కొద్దిసేపు ప్రేక్షకులతో కలసి సినిమాను వీక్షించారు. అక్కడకు వచ్చిన ప్రేక్షకులు, అభిమానులు నటీనటులు, సంగీత దర్శకుడితో ఫొటోలు దిగడానికి ఉత్సాహం చూపారు.

మన చరిత్రను భావితరాలకు తెలియజేయాలి

మన చరిత్రను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని సినీనటి అనసూయ అన్నారు. నాడు రజాకార్లు హైదరాబాద్ సంస్థానంలో ప్రజలను ఎంత ఇబ్బంది పెట్టారో రజాకార్ చిత్రంలో చూపించడం జరిగిందని, తెలంగాణ గడ్డపై పుట్టిన ప్రతీఒక్కరు ఈ సినిమాను చూడాలని కోరారు. నాడు రజాకార్ల ఆగడాలను ఎదిరించిన యోధుల చరిత్రను మరువద్దన్నారు. ఈ సినిమాతో తనకు మరింత గుర్తింపు వచ్చిందని, ఇందులో తనకు నటించే అవకాశం కల్పించిన దర్శకుడు సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. మానుకోట ప్రాంతవాసి సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకు మంచి సంగీతాన్ని అందించారని చెప్పారు.

స్వేచ్ఛ కోసం జరిగిన పోరాటం

నిజాం నిరంకుశ పాలనలో రజాకార్ల ఆగడాలను ఎదురించి పోరాడిన యోధుల చరిత్రను భావితరాలకు అందించేందుకు తీసిన చిత్రం రజాకార్ అని సినీ దర్శకుడు యాట సత్యనారాయణ పేర్కొన్నారు. తెలంగాణ గడ్డపై ఉన్న అందరికీ ఈ చరిత్ర తెలువాలన్నారు. నాడు పర్కాలలో తొలి జాతీయజెండా ఎగురవేత, వరంగల్ జిల్లాలోని ఖిలాలో బత్తిని మొగిలయ్య జెండాను ఎగురవేసిన చరిత్ర రజాకార్ సినిమాలో కళ్లకు కట్టినట్లుగా చూపించామన్నారు. సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో మాట్లాడుతూ గత చరిత్ర భావితరాలకు తెలియకుంటే మన చరిత్రను తెలియ జేయడానికి ఎవరూ ఉండరని చెప్పారు. రజాకార్ చిత్రాన్ని విజయవంతం చేసిన ప్రేక్షకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం చిత్ర యూనిట్ సభ్యులను ఘనంగా సన్మానించారు ఈ కార్యక్రమంలో లక్ష్మీ థియేటర్ యాజమాని చాపల రంజిత్‌రెడ్డి, డాక్టర్ బానోత్ వీరన్న, డాక్టర్ పరికిపండ్ల అశోక్, స్థానిక సినీ నటులు రాజు, శ్రీను పాల్గొన్నారు.

బయ్యారంలో..

బయ్యారం మండలకేంద్రంలోని గాంధీ సెంటర్‌లో ఉన్న తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద రజాకార్ చిత్ర యూనిట్ సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాం పాలనలో పేదల పక్షాన పోరాడి అమరులైన వీరులు చిరస్థాయిలో చరిత్రలో నిలిచి పోతారని చెప్పారు. అనంతరం రజాకార్ చిత్ర విశిష్టతను ప్రజలకు తెలియపర్చిన యూనిట్ సభ్యులు ప్రతీ ఒక్కరు ఈ సినిమాను చూడాలని విజ్ఞప్తి చేశారు. చిత్ర యూనిట్ సభ్యులకు కళాకారులు ఘన స్వాగతం పలికారు, ఈ కార్యక్రమంలో సినీనటీ అనసూయ, దర్శకులు యాట సత్యనారాయణ, సంగీత దర్శకుడు బీమ్స్ సిసిరోలియో, బయ్యారం వీరన్న పాల్గొన్నారు.

గందరగోళంలో 'గృహజ్యోతి'



- జీరో బిల్లు రాకపోవడంతో వినియోగదారుల్లో అయోమయం
- తిరస్కరణకు గురైన దరఖాస్తులకు ఎన్నికల కోడ్ అడ్డంకి
- తర్వాత జీరో బిల్లు ఇస్తామంటున్న విద్యుత్ అధికారులు

హనుమకొండ టౌన్, మార్చి 21: 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగించుకున్నప్పటికీ జీరో బిల్లు రాకపోవడంతో గృహజ్యోతి పథకానికి దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జీరో బిల్లు రాని వాళ్లు మరోసారి మండల పరిషత్, మునిసిపల్ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ ఆయా కౌంటర్లలో ఎన్నికల్లో కోడ్ పేరిట దరఖాస్తులను స్వీకరించడం లేదు. దీంతో లబ్ధిదారుల్లో హైరానా మొదలైంది. తెల్లరేషన్ కార్డు ఉండి 200 యూనిట్లలోపు విద్యుత్ వాడకునే కుటుంబాలు జీరోబిల్లు రాకున్నా విద్యుత్ బిల్లు కట్టాల్సిన అవసరం లేదని ఉప ముఖ్యమంత్రి చెప్పినప్పటికీ అధికారికంగా ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వలేదు. ఇదిలా ఉంటే.. విద్యుత్‌శాఖ అధికారులు సైతం ఎన్నికల తర్వాత మార్చి, ఏప్రిల్, మే నెలలకు కలిపి జీరో బిల్లు ఇస్తామని, ఎలాంటి ఆందోళన అవసరం లేదని చెబుతున్నప్పటికీ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయడం లేదు. దీంతో లబ్ధిదారుల్లో టెన్షన్ మొదలైంది.

అవగాహన లోపం

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన పేరిట ఆరు గ్యారంటీలకు దరఖాస్తులు స్వీకరించింది. దరఖాస్తు సమయంలో ఏ విధంగా దరఖాస్తు చేసుకోవాలి.. ఏ పథకానికి ఏ వివరాలు నింపాలి.. అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడంలో విఫలం చెందారు. ఫలితంగా కొంతమంది లబ్ధిదారులు ఒకదాని బదులు ఇంకొకటి రాశారు. గృహజ్యోతికి దరఖాస్తు చేసుకునే సమయంలో యుఎస్సీ నెంబర్‌కు బదులు ఎస్సీ నెంబర్ రాశారు. ఇంకొందరు సరిగ్గా రాసినప్పటికీ డాటా ఎంట్రీ చేసే సమయంలో అయిన తప్పిదాల కారణంగా జీరో బిల్లు రాలేదని తెలుస్తోంది. అయితే మరోసారైనా సరిగా దరఖాస్తు చేసుకుందామని మునిసిపల్, మండల పరిషత్ కార్యాలయాలను ఆశ్రయిస్తున్నప్పటికీ దరఖాస్తులు స్వీకరించపోవడంతో నిరాశతో వెనుతిరుగుతున్నారు.

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా..

హనుమకొండ జిల్లాలో 1,02,56 మంది దరఖాస్తు చేసుకోగా, 98,864 మందికి మాత్రమే జీరోబిల్లు వచ్చింది. జనగామ జిల్లా నుంచి 78,655 మంది దరఖాస్తు చేసుకుంటే 77,822 మంది మాత్రమే జీరో బిల్లు పొందారు. మహబూబాబాద్ జిల్లా నుంచి 90,026 మందికి 88,658 మంది మాత్రమే జీరోబిల్లు పొందారు. అదే విధంగా ములుగు, భూపాలపల్లి నుంచి 77,250 మంది దరఖాస్తు చేసుకుంటే 72,638 మంది జీరోబిల్లు పొందారు. వరంగల్ జిల్లా నుంచి 1,02,836 మంది దరఖాస్తు చేసుకుంటే 99,426 మంది మాత్రమే జీరో బిల్లు పొందారు.

రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధం

ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



కాజీపేటలోని మీడియా పాయింట్‌లో మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

కాజీపేట, మార్చి 21: అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పంటనష్టంపై అంచనావేయాలని అధికారులను ఆదేశించారని స్టేట్ కో- ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ అండ్ గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. గురువారం కాజీపేట మీడియా పాయింట్‌లో జంగా రాఘవరెడ్డి మాట్లాడారు. గత ప్రభుత్వాలు రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వకుండా తీవ్ర అన్యాయం చేశారన్నారు. తెలంగాణ కోసం 12 వందల మంది ఉద్యమకారులు ప్రాణాల త్యాగాలు చేస్తే బోగాలు అనుభవించి, విపరీతమైన ఆస్తులు సంపాదించింది మాత్రం కల్వకుంట్ల కుటుంబమేనన్నారు. పార్లమెంట్ ఎన్నికల కోసం బీఆర్ఎస్ నాయకులు రైతులపై కపట ప్రేమ చూపిస్తున్నారని ఎద్దేవ చేశారు. రైతుల కోసం ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడటం విడ్డూరంగా వుందన్నారు.

రైతు అభివృద్ధిపై ఎర్రబెల్లి దయాకర్ రావు చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. దయాకర్‌రావు ఓ పెద్ద దొంగ అని, ఫోన్ ట్యాపింగ్ కేసులో జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. బీజేపీ సైతం రైతుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. ఎన్నికల కోసం బీజేపీ డ్రామాలు తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం అన్నారు. ఈ మీడియా సమావేశంలో కాంగ్రెస్ నాయకులు సుంచు చంద్రయ్య, తొట్ల రాజు యాదవ్, బోయిని కుమార్, గర్రం కోటేశ్వర్, గంగుల శ్రీనివాస్ రెడ్డి, కట్కూరి రమేశ్‌తో పాటు జిల్లా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

క్రీడారంగంలో అగ్రస్థానంలో నిలపాలి

● ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 21 : క్రీడారంగంలో జిల్లాను అగ్రస్థానంలోనిలపాలని ఎస్పీ సుధీర్‌రామ్‌నాథ్ కేకన్ అన్నారు. మానుకోట పట్టణం ఎన్టీఆర్ స్టేడియంలో గురువారం మహబూబాబాద్ ప్రీమియర్ లీగ్-4 క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసాన్నివడంతో పాటు శారీరకదృఢత్వాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. జిల్లాకు చెందిన ఎంతో మంది క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారని వివరించారు. వారిని ఆదర్శంగా తీసుకొని, యువత క్రీడల్లో రాణించి, జిల్లాను అగ్రస్థానంలో నిలపాలని సూచించారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని, క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ పోటీల్లో జిల్లా వ్యాప్తంగా 50 టీంలు పాల్గొనట్లు ఎంపీఎల్ వ్యవస్థాపకుడు యాళ్ల మురళీధర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 50,116, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 25,116, తృతీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ. 15,116, నాలుగవ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.6,116 నగదు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీఎల్ బాధ్యులు సందీప్ నాయక్, శ్రీపాల్, శివకుమార్, అనిల్, కిషోర్, పవన్ పాల్గొన్నారు.



మహబూబాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న ఎస్పీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్

తాగునీటి సరఫరాకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలి

● కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలం దృష్ట్యా క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీరందించేందుకు యాక్షన్‌ప్లాన్‌ను రూపొందించాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో గురువారం మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ప్రజలకు అందిస్తున్న తాగునీటి సరఫరాపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలు, మునిసిపాలిటీల్లో క్షేత్ర స్థాయిలో మిషన్‌భగీరథ ద్వారా ప్రజలకు తాగునీరు అందించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని సూచించారు. నీటి కొరత ఉన్నచోట ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం తాగునీటి సరఫరా అందించాలని అందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్‌ను రూపొందించాలని సూచించారు. తాగునీటికి ఇబ్బందులు లేకుండా బోరుబావులు, చేతిపంపులకు మరమ్మతులు చేపట్టాలని, నీటి వనరులపై నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, వెనుకబడిన తరగతుల వసతిగృహాల్లో నిరంతరం తాగునీరు అందించాలని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో, మిషన్ భగీరథ (గ్రిడ్) ఈఈ సురేందర్, మిషన్ భగీరథ (ఇంట్రా) ఈఈ కృష్ణారెడ్డి, డీపీవో హరిప్రసాద్, మునిసిపల్ కమిషనర్లు నోముల రవీందర్, శాంతకుమార్, వెంకటేశ్వర్లు, రవీందర్, అధికారులు నర్సింహాస్వామి, బాలరాజు, ఎర్రయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్



కేసముద్రం టీటీడబ్ల్యూఆర్ఎస్‌లో 'స్వీప్' అక్షరాల ఆకారంలో కూర్చున్న విద్యార్థినులు

ఓటువేసే బాధ్యతపై చైతన్యం కల్పించాలి

● డీఆర్‌డీవో పురుషోత్తం

కేసముద్రం, మార్చి 21 : విద్యార్థులు తమ తల్లిదండ్రులకు ఓటువేసే బాధ్యతపై చైతన్యం కల్పించాలని డీఆర్‌డీవో పురుషోత్తం సూచించారు. కేసముద్రం గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో గురువారం 'క్రమబద్ధమైన ఓటర్ల విద్య, ఎన్నికల భాగస్వామ్యం' (స్వీప్)పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు ఓటరు అవగాహనపై వ్యాసరచన పోటీని నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ తాళ్లూరి దామోదర్, ప్రిన్సిపాల్ జె.స్వప్న, డీపీఎం రాజు, ఏపీఎం రాజీర్, సీసీ వెంకటనారాయణ, అశోక్ పాస్, శ్యాం పాల్గొన్నారు.

'భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలి'

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 21 : విద్యార్థి దశనుంచే ప్రతీ విద్యార్థి భగత్‌సింగ్ ఆశయ సాధనకు కృషి చేయాలని భారత విద్యార్థి సమాఖ్య (ఎస్ఎఫ్ఐ) జిల్లా కన్వీనర్ పట్ల మధు పిలుపునిచ్చారు. ఈదులపూసపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గురువారం భగత్‌సింగ్ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో రాకేష్, హస్మా, మహేష్, రవీన్, ప్రవీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

కేసముద్రం, మార్చి 21 : కేసముద్రం మండలం అర్పనపల్లిలో గురువారం 7 నుంచి 9వ తరగతులకు చెందిన 22 మంది విద్యార్థులకు రూ.1.33 లక్షలతో 22 సైకిళ్లను మిడ్‌వెస్ట్ గ్రానైట్స్ కంపెనీ తరపున జీఎం మూల వినయేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. విద్యార్థులు నిత్యం మూడు కిలోమీటర్ల దూరంలోని ఉప్పరపల్లి జడ్పీహైస్కూల్‌కు నడుచుకుంటూ వెళుతున్నారని గ్రామానికి చెందిన పలువురు యువకులు గ్రానైట్స్ సంస్థ అధినేత రాఘవరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ఆయన స్పందించి సైకిళ్లనుబహూకరించినట్లు యాజమాన్యం తెలిపింది. పీఆర్‌వో సమ్మిరెడ్డి, అకౌంట్స్ మేనేజర్ గొండ్ల మల్లయ్య, గంధం భరత్, గంధసిరి వెంకన్న, మోడెం రాజు, చీర వెంకన్న, సంతోష్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడిపై డీపీవో సమీక్ష

కేసముద్రం, మార్చి 21 : కేసముద్రం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్ పంచాయతీ కార్యదర్శులతో వేసవిలో తాగునీటి ఎద్దడి నివారించేందుకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కేసముద్రం విలేజి దర్గా సమీపంలోని తాగునీటి బావిని అధికారులు పరిశీలించారు. ఎంపీవో ప్రసాదరావు, మిషన్ భగీరథ అధికారులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన బెల్లయ్యనాయక్

మహబూబాబాద్ టౌన్, మార్చి 21 : హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆదివాసీ కాంగ్రెస్ జాతీయ వైస్‌చైర్మన్, రాష్ట్ర గిరిజనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్ తేజావత్ బెల్లయ్యనాయక్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఇటీవల గిరిజనాభివృద్ధి సంస్థ కార్పొరేషన్ చైర్మన్‌గా ఎన్నికైన బెల్లయ్యనాయక్ గురువారం సీఎం కలిసి శాలువాతో సత్కరించారు. గిరిజన కార్పొరేషన్ చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు సీఎంకి కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్వాడో

మహబూబాబాద్ టౌన్, మార్చి 21 : జిల్లా కేంద్రంలోని బెస్తబజారు, రామన్నపేట కాలనీ అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం పోషణ్‌పక్వాడ్‌కార్యక్రమాన్ని నిర్వహించారు. పోషణ్‌పక్వాడ్‌లోభాగంగా గర్భిణీలకు, బాలింతలకు, కిషోర బాలికలకు పౌష్టికాహారం గూర్చి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతులుగా జీవించాలని సూచించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణీలకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రభుత్వం పౌష్టికాహారం అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతుందన్నారు ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హేమ,శిరీష పాల్గొన్నారు.

'ప్రతీ రైలులో ఐదు జనరల్ బోగీలను ఏర్పాటు చేయాలి'

● పీఎం కోటి ఉత్తరాల కార్యక్రమం ప్రారంభం

మహబూబాబాద్ టౌన్, మార్చి 21 : దేశ వ్యాప్తంగా ప్రతి రైలులో ఐదు సాధారణ (జనరల్) బోగీలను ఏర్పాటు చేయాలని సామాజిక వేత్త డాక్టర్ పరికిపండ్ల అశోక్ కోరారు. మానుకోటలో గురువారం దేశప్రధానికి కోటి ఉత్తరాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ ప్రతీ రైలులో సాధారణ బోగీలు తక్కువగా ఉండడంతో సామన్య మధ్యతరగతి ప్రజలు ప్రయాణిం చాలంటే ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశా రు. అనంతరం రజాకార్ యూనిట్ సభ్యులచే పోస్టర్లు, బ్యానర్లను ఆవిష్కరింపజేశారు.

'మానుకోట క్రికెట్ అసోసియేషన్‌కు హెచ్‌సీఏ గుర్తింపు ఇవ్వాలి'

● హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు వినతి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి21 : మహబూబాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు హైదరాబాద్ క్రికెట్ గుర్తింపు ఇవ్వాలని మానుకోట క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి. అజయ్‌సారథిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు వరంగల్ గురువారం హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు వినతి పత్రం అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అజయ్ సారథిరెడ్డి మాట్లాడుతూ ఇప్పటి వరకు హైదరాబాద్ మినహా తెలంగాణ జిల్లాల్లోని పాత, ఉమ్మడి జిల్లా క్రికెట్ అసోసియేషన్‌లు కొత్తగా ఏర్పడిన జిల్లాలకు సరియైన గుర్తింపు, అవకాశాలు, అభివృద్ధి జరగలేదన్నారు. మహబూబాబాద్‌తో పాటు కొత్త జిల్లాలన్నింటికీ హెచ్‌సీఏ సభ్యత్వం, గుర్తింపు ఇవ్వాలన్నారు. కేవలం హైదరాబాద్ నగర పరిధిలోనే 230 క్లబ్‌లకు అవకాశం కల్పించి ఇతర జిల్లాలకు ఒకటిచొప్పున కేవలం 10 లోపు మాత్రమే గుర్తింపు ఇవ్వటం అంటే తీవ్ర వివక్ష, నిర్లక్ష్యం క్రికెట్‌లో, క్రీడల్లో జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పెరుగుకుమార్, తోట వినయ్, రావుల నవీన్ రెడ్డి, తీగెల కృష్ణారెడ్డి, బి.ధర్మచరణ్ రెడ్డి. చిన్మయ్, అరవింద్ తదితరులు పాల్గొన్నారు.



వరంగల్‌లో హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్మోహన్‌రావుకు వినతిపత్రం అందజేస్తున్న అజయ్‌సారథిరెడ్డి

హమాలీ కూలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

● ఇఫ్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్

మహబూబాబాద్ రూరల్, మార్చి 21 : హమాలీ కూలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ఇఫ్టు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్దన్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని సురేశన్న స్మారకభవనంలో గురువారం తెలంగాణ ప్రగతిశీల హమాలీ అండ్ మిల్లు వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ రాష్ట్రంలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో వేలాది మంది హమాలీ కార్మికులు పని చేస్తుంటే వారికి సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. ఈ సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, లింగయ్య, సారంగపాణి, పర్వత కోటేష్, మోహన్, చంద్రు, వీరన్న, మధు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో ఒక ఎంపీ సీటు కేటాయించాలి : సీపీఎం

మహబూబాబాద్ టౌన్, మార్చి21 : తెలంగాణలోని నాలుగు పార్లమెంట్ నియోజకవర్గాలైన ఖమ్మం, మహబూబాబాద్, నల్లగొండ, భువనగిరిల్లో ఏదైన ఒక్క ఎంపీ స్థానాన్ని సీపీఎంకు కేటాయించాలని కాంగ్రెస్‌ను కోరామని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సుంకరి వీరయ్య అన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్‌తో సీట్ల సర్దుబాటుకు సీపీఎం సిద్ధంగా ఉందని వివరించారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీపీఎం భువనగిరి పార్లమెంటరీ నియోజకవర్గ అభ్యర్థిని ప్రకటించిందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో వేచిచూడడం వల్ల చివరికి తాము ప్రచారం కూడా చేసుకోవడానికి సమయం సరిపోలేదని తెలిపారు. అందుకోసం తాము భువనగిరిలో అభ్యర్థిని ప్రకటించి ప్రచారానికి సిద్ధమవుతున్నామన్నారు. తాము కోరిన నాలుగింటిలో రెండు నియోజకవర్గాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించిందని, మిగిలినవి రెండే ఉన్నాయని తెలిపారు. తెలంగాణలో ఒక్కసీటును కేటాయించాలని సీపీఎం జాతీయ నాయకత్వం ఏఐసీసీ దృష్టికి తీసుకువెళ్లారని ఆయన తెలిపారు.

తెలంగాణలో బీజేపీకి ఒక్కసీటు రాదు..

ఇండియా కూటమిలోని కాంగ్రెస్, సీపీఐ, సీపీఎం కలిసి పనిచేస్తే తెలంగాణలో బీజేపీకి ఒక్కసీటు కూడా రాదని సీపీఎం నాయకుడు వీరయ్య స్పష్టం చేశారు. ఉన్న నాలుగు సీట్లు కూడా బీజేపీకి దక్కవన్నారు. కేంద్రంలో మోదీ మళ్లీ అధికారంలోకి రాకుండా చూడాలన్నదే సీపీఎం ఉద్దేశమని, అందు కోసం బీజేపీ వ్యతిరేక పార్టీలన్ని ఇండియా కూటమిలో ఉన్నాయన్నారు. తెలంగాణలో బీజేపీ బలపడకుండా నిలువరించాలంటే బీజేపీ వ్యతిరేక పార్టీలన్ని కలిసి పనిచేయాలన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగడంపై నిపుణుల కమిటీవేసి నిజనిజాలు తేల్చివారి సిఫార్సులను అఖిలపక్షం ముందుంచాలని డిమాండ్ చేశారు. అంతే కాకుండా ఎవరి వల్లనష్టం జరిగిందనే విషయంపై న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ కమిటీనివేయాలని, తప్పులు చేసిన వారిని గుర్తించి, కఠినంగా శిక్షించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సూర్నపు సోమయ్య, ఆకుల రాజు పాల్గొన్నారు.

అనంతాద్రిలో శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు షురూ

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, మార్చి 21 : మానుకోట మునిసిపల్ పరిధిలోని అనంతాద్రి స్వయంభూ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో గురువారం బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ప్రధాన అర్చకుడు గొడవర్తి చక్రధరాచార్యుల వేదమంత్రోచ్ఛరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు బ్రహ్మోత్సవ ఆరంభం, విష్వక్సేన ఆరాధన, వాసుదేవపుణ్యాహవచనం, రక్షాబంధనం, మృత్సం గ్రహణం, రుత్విక్‌కరణం, అంకురారోపణ, నివేదన మొదలగు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయట్రస్టు చైర్మన్ నూకల రాంచంద్రారెడ్డి దంపతులు, ట్రస్టుబాధ్యులు నాయిని ప్రభాకర్‌రెడ్డి, మాలె కాశీనాథ్ దంపతులు, మల్యాల రంగారావు, అర్చకులు హేమంత చార్యులు, శ్రావణ్‌కుమారచార్యులు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

జీవంచిపల్లి కాలనీలో గుడుంబా పట్టివేత

గార్ల, మార్చి 21 : పట్టణంలోని జీవంచిపల్లి కాలనీలో గురువారం స్థానిక పోలీసులు పెట్రోలింగ్ నిర్వహించే సమయంలో ధరవత్ రాంబాబు ఇంట్లో 11 లీటర్ల నాటు సారాను పట్టుకున్నామని ఎస్సై నిమ్మతోట జీనత్‌కుమార్ తెలిపారు. పట్టుబడిన సారాను సీజ్‌చేసి, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

'గర్భిణుల వివరాల నమోదులో ముందుండాలి'

గార్ల, మార్చి21 : గ్రామాల్లో గర్భిణీ మహిళలను ముందు వరుసలో గుర్తించి రికార్డుల్లో నమోదు చేయాలని కోరుతూ ముల్కనూరు ఆస్పత్రి సిబ్బంది డిప్యూటీ డీఎంహెచ్‌వో అంబరీష ఆదేశించారు. గురువారం ముల్కనూరు పీహెచ్‌సీ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీచేసి, సిబ్బంది, పనితీరు రికార్డులను స్వయంగా పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం సిబ్బంది రివ్యూ మిటింగ్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. డాక్టర్ వేణుమాధవ్, సిబ్బంది వడ్డె బోయిన శ్రీనివాస్, కృష్ణాఅర్జున్ రావు, శ్రీహరి, సక్కుబాయి, నవీన్, శ్రీహరి, పద్మ, కృష్ణ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● కురవి : కురవి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ అంబరీష తనిఖీ చేశారు. ఓపీ సేవలు, డెలివరిరూమ్‌లతో పాటు రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ గర్భిణీలకు నార్మల్ డెలివరి అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, రాబోయే వేసవిలో తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మలేరియా, ఫైలేరియా, టీబీ తదితర వ్యాధుల పట్ల సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ విరాజిత, సీహెచ్‌వో కృష్ణార్జునరావు, వడ్డెబోయిన శ్రీనివాస్ పాల్గొన్నారు.

'కుష్టువ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి'

నెహ్రూసెంటర్, మార్చి21 : ప్రజలు కుష్టువ్యాధి బారిన పడకుండా వైద్యాధికారులు, సిబ్బంది వ్యాధి నిర్మూలన కోసం కృషి చేయాలని డీఎం అండ్‌హెచ్‌వో బి.కళావతిబాయి అన్నారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అర్బన్ పీహెచ్‌సీ పరిధిలోని గిరిప్రసాద్‌నగర్‌లో గురువారం ఇం టింటికి వైద్య సిబ్బంది వెళ్లి కుష్టువ్యాధి నిర్ధారణ సర్వేను చేపట్టారు. ఈ సర్వే తీరును జిల్లా వైద్యాధికారి బి.కళావతిబాయి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కిరణ్మయి,ఎన్‌సీడీ కోఆర్డినేటర్ వెంకటేశ్వరరాజు, శ్రీనివాస్, పురుషోత్తం, రత్నకుమారి పాల్గొన్నారు.

వనం నుంచి గుడిలోకి చేరిన శ్రీముసలమ్మ దేవత



గుంజేడులో శ్రీముసలమ్మ దేవత పూజలు చేస్తున్న భక్తులు

కొత్తగూడ, మార్చి21 : భక్తుల కోరికలు తీర్చేందుకు శ్రీముసలమ్మ దేవత వనంలోని గుట్టమీద నుంచి గుడిలోకి ప్రవేశించింది. శ్రీముసలమ్మ మహా జాతరలో భాగంగా గురువారం గుంజేడులో శ్రీముసలమ్మ జాతరను పూజారులు, గ్రామస్తులు, భక్తులు వైభవంగా నిర్వహించుకున్నారు. ముందుగా శ్రీముసలమ్మ పూజారి తోలెం నీవస్‌కుమార్ ఇంటివద్ద ;సాంప్రదాయ పూజలు, పడిగలకు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం పడిగలతో పూజారులు భక్తులు సమీపంలోని శ్రీముసలమ్మ దేవత గుట్టపైకి చేరుకున్నారు. గుట్టపైన దేవతకు సాంప్రదాయ పూజలు నిర్వహించారు. పూజలు చేసిన అనంతరం డోలీ వాయిద్యాలు మ్రోగిస్తుండగా, శివసత్తుల పూనకాల మధ్య అగ్నిగుండాలు దాటుతూ శ్రీముసలమ్మ దేవతను పూజారి తోలెం నవీన్‌కుమార్ తీసుకువచ్చి గుడిలో ప్రతిష్ఠించారు. అనంతరం భక్తులు పూజలు చేశారు.ఈవో భిక్షమాచారి, పూజారులు తోలెం చిన్ననర్సయ్య, తోలెం వెంకటేశ్వర్లు, తోలెం వెంకన్న, కిరణ్‌కుమార్, రాంబాబు, నవీన్‌కుమార్, అనంతరావు, భక్తులు పాల్గొన్నారు.

వైభవంగా కొమ్మాలమ్మ జాతర



సాధిరెడ్డి పల్లిలో వనంను తీసుకువస్తున్న పూజారులు

కొత్తగూడ, మార్చి 21 : వాసం వంశీయుల ఇలవేలుపు కొమ్మాలమ్మ దేవత జాతర మండలంలోని ఎంచగూడెంలో గురువారం వైభవంగా జరిగింది. ముందుగా కోనాపురం అడవిలో నుంచి వాసం వంశం పూజారులు, ఆలూరి వంశం వడ్డెలు వనంను తీసుకువచ్చారు. డోలీలు మోగిస్తుండగా.. శివసత్తులు పూనకాలు ఊగుతుండగా.. కోనాపురం గ్రామం నుంచి సాధిరెడ్డిపల్లి మీదుగా వనంను తీసుకువచ్చి ఎంచగూడెంలోని కొమ్మాలమ్మ దేవత గద్దెపై ప్రతిష్ఠించారు. సంతానం లేని మహిళలు వనంను తీసుకువస్తున్న క్రమంలో సంతు (వరం)పట్టారు. శివసత్తులు వారిని ఆశీర్వాదించారు. భక్తులు కోళ్లను, మేకలను ఎదురుమొక్కారు. భక్తులు కొమ్మాలమ్మ దేవతను దర్శించుకున్నారు. మొక్కులు చెల్లించారు. దల్వాయి వాసం సమ్మయ్య తలపతి వాసం వీరాస్వామి, వడ్డెలు ఆలూరి శ్రీను, ఆలూరి బుచ్చయ్య జలకపు వడ్డె యాలం లక్ష్మయ్య, ఉద్యోగులు వాసం కుమారస్వామి, ఆలూరి సమ్మయ్య, వాసం పాపయ్య, వాసం సందీప్, ఆలూరి సారంగపాణి, వాసం ప్రభాకర్, ఆలూరి క్రిష్ణయ్య, భక్తులు పాల్గొన్నారు.

రైతుల కోసం ఉద్యమిస్తే అక్రమ కేసులా?

● సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్

మహబూబాబాద్ టౌన్, మార్చి 21 : గిరిజన రైతుల కోసం ఉద్యమిస్తే తమపై అక్రమకేసులు పెట్టారని వాటిని తక్షణమే ఎత్తివేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్ అన్నారు. మహబూబాబాద్ జిల్లా నూతన కలెక్టర్ నిర్మించే సమయంలో సాలార్‌తండా గిరిజన రైతుల భూములను ప్రభుత్వం తీసుకుంటూంటే సీపీఐ, ఇతర సంఘాలు కలిసి రైతుల పక్షాన ఉద్యమిస్తే కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. సదరు కేసులో మహబూబాబాద్ కోర్టులో గురువారం సీపీఐ నాయకులు, గిరిజన రైతులు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ సీపీఐ పోరాట ఫలితంగా గిరిజన రైతులకు ఎకరాకు రూ21 లక్షల చొప్పున ప్రభుత్వం చెల్లించడం జరిగిందన్నారు. కలెక్టర్ నిర్మాణం జరిగి, రైతులకు పరిహారం అంది సంవత్సరాలు గడుస్తున్న తమపై పెట్టిన కేసులు మాత్రవ కొట్టివేయడం లేదన్నారు. తక్షణమే సీపీఐ నాయకులు, రైతులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, గిరిజన రైతులు శివాజీ, మంగ్యా, వెంకన్న, సురేందర్, బాలాజీ పాల్గొన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీలు

తొర్రూరు రూరల్, మార్చి 21 : తొర్రూరు మండలంలో గత సంవత్సరం 2022-23 సంవత్సరంలో జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం (ఎన్ఆర్‌ఈజీఎస్) చేసిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సిలార్‌సాబ్ తెలిపారు. మండలంలోని అమ్మాపురం, వెల్లికట్టె, గుర్తూర్, మడిపల్లి, నాంచారిమడూరు, కర్కాల, హరిపిరాల, మాటేడు పత్తేపురం తదితర గ్రామాల్లో చేపట్టిన పనులపైసామాజిక తనిఖీ బృందం చేసిన పనులు, మస్టర్లను, ఎంబీ రికార్డులను పరిశీలించి, తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. పనుల్లో ఎక్కడైనా అవకతవకలు జరిగితే ఓపెన్ ఫోరంలో వివరాలు వెల్లడించి సంబంధిత అవకతవకలపై ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, డీఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో యువత సత్తాచాటాలి

● యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్‌యాదవ్

తొర్రూరు రూరల్, మార్చి 21 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గెలుపు కోసం యువత తనసత్తా చాటాలని తొర్రూరు కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు పయ్యావుల ప్రవీణ్‌యాదవ్ అన్నారు. గురువారం మండలంలోని పోలేపల్లి గ్రామంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వందరోజుల్లోనే ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగు అమలు చేస్తుందన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రజాసంక్షేమం కోసం పాటుపడే కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం యువత కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తొర్రూరులో 30 లీటర్ల నాటుసారా పట్టివేత

● సారా విక్రయిస్తే చర్యలు తప్పవు : ఎస్సై

తొర్రూరు, మార్చి 21 : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా గుడుంబా, నాటుసారా విక్రయించినా, రవాణా చేసినా చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్సై రవళి అన్నారు. ఎక్సైజ్ ఎస్సై రవళి కథనం ప్రకారం. గురువారం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని తొర్రూరు పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న 10లీటర్ల నాటుసారా, పోలెపల్లి గ్రామ శివారు తన్యాతండాకు చెందిన వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై తరలిస్తున్న 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా గుడుంబా, నాటుసారా విక్రయాలు చేపడితే చర్యలుంటాయని హెచ్చరించారు. మద్యందుకాణాల్లో ఎమ్మార్పీ ధరలకే విక్రయాలు చేపట్టాలని, అధిక ధరలకు విక్రయిస్తే బాధితుల ఫిర్యాదు మేరకు దుకాణాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. సిబ్బంది కృష్ణ, యాకూబ్, మహేష్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ వారోత్సవాలు

తొర్రూరు, మార్చి 21 : అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు అంగన్‌వాడీ సెక్టార్ సూపర్‌వైజర్ శోభ అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలోని ఎస్సీ కాలనీ పాఠశాల పరిధిలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. పాఠశాల హెచ్‌ఎం రాజసుకన్య, అంగన్‌వాడీలు లలిత, సాంబలక్ష్మి, ఫిరోజ, ప్రమీల, వైద్య సిబ్బంది వెన్నెల, ఆశా వర్కర్‌లు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

'ప్రాథమిక దశలో గుర్తిస్తే కుష్టువ్యాధి నియంత్రణ'

తొర్రూరు, మార్చి 21 : కుష్టువ్యాధి అతి సామాన్యమైన వ్యాధి అని, ప్రాథమిక దశలో గుర్తిస్తే మందులతో పూర్తిగా నయం చేయవచ్చని డిప్యూటీ పారామెడికల్ అధికారి వనాకర్‌రెడ్డి అన్నారు. గురువారం తొర్రూరు పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య సిబ్బంది చేపడుతున్న కుష్టు వ్యాధి సర్వేను పరిశీలించి, తగు సూచనలు చేశారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ విజయ్ కుమార్, వైద్య సిబ్బంది ఉన్నారు.

మరిపెడలో కోనోకార్పస్ చెట్ల తొలిగింపు



కోనోకార్పస్ చెట్లను తొలిగిస్తున్న దృశ్యం

మరిపెడ, మార్చి 21 : మునిసిపల్ కేంద్రంలోని రోడ్డు డివైడర్‌పై నాటిన కోనోకార్పస్ చెట్లను ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ రాంచంద్రునాయక్ ఆదేశానుసారం మునిసిపల్ సిబ్బంది గురువారం తొలగించారు. ఈ చెట్లు మానవాళి మనుగడకు పెను ప్రమాదమని గుర్తించిన ప్రభుత్వ విప్ మునిసిపల్ అధికారులను చెట్లను తొలగించాలని ఆదేశించారు. వీటి తొలగింపుతో పట్టణ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

చిన్నగూడూరు, మార్చి 21 : మండలంలోని విస్సంపల్లి గ్రామంలో గురువారం ఎన్ఆర్ ఈజీఎస్‌లో మంజూరైన రూ.10లక్షల సీసీ రోడ్డు పనులను డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ ఆదేశాల మేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారబోయిన వేంకటేశ్వర్లు భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని గుర్తుచేశారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సుధగాని నాగేష్‌గౌడ్, గ్రామ పార్టీ అధ్యక్షుడు వి.యాకన్న. శ్రీశైలం, వెంకన్న, లింగన్న, కృష్ణ, లక్ష్మణ్, నందు, మహేష్ ఉన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో మంటలు

మరిపెడ, మార్చి 21 : విద్యుదాఘాతంతో మరిపెడ మునిసిపల్ ఆఫీస్ దగ్గర్లో గురువారం మంటలు ఎగిసిపడ్డాయి. మంటలను గుర్తించిన మునిసిపల్ సిబ్బంది అగ్నిమాపక సిబ్బందికి వెంటనే సమాచారం అందించారు. సకాలంలో ఫైర్ సిబ్బంది చేరుకొని మంటలను ఆర్పివేశారు. దట్టమైన పొగలు మునిసిపల్ ఆఫీస్‌ను కమ్మేయడంతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మంటలు ఎగిసిపడడంతో సిబ్బందితోపాటు సమీప ఇండ్ల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తృటిలో మునిసిపల్ ఆఫీస్‌కు ప్రమాదం తప్పిందని కార్యాలయ సిబ్బంది ఊపిరిపీల్చుకున్నారు. ఫైర్ సిబ్బంది రఘుపాల్‌రెడ్డి, రాజు, లక్ష్మీరామ్, పాష మంటలను ఆర్పివేశారు.